## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**ఘట్‌కేసర్:** మున్సిపాలిటీలోని మూడో వార్డులో శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన రెండు శిలాఫలకాలపై మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేరును పొందుపర్చని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఉప సర్పంచ్ ఎంపాల సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని ఉన్నా ఎందుకు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

## సీఎంఆర్ కళాశాలలో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను మంగళవారం జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. జేఎన్‌టీయూహెచ్ సహకారంతో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో జరిగే వర్క్‌షాప్‌లో డిజిటల్ సిస్టమ్ డిజైన్ యూజింగ్ టూల్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఈసీఈ హెడ్ రజిని, కోఆర్డినేటర్ సత్యసావిత్రి, రవీంద్రబాబు, నాగరాజునాయక్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సత్కారం



డాక్టర్ ఆకాంక్షను సత్కరిస్తున్న చంద్రారెడ్డి

**కీసర:** దమ్మాయిగూడ ఓల్డ్ విలేజ్ బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న డాక్టర్ సాయి ఆకాంక్షకు కలెక్టర్ గౌతమ్ బెస్ట్ మెడికల్ ఆఫీసర్ మెరిటోరియస్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నాగారంలో ఉంటున్న ఆకాంక్షను మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఘనంగా సత్కరించారు. అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**కుషాయిగూడ:** మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. 30న సాయంత్రం అంకురార్పణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు తీర్థగోష్ఠి, నూతన శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

## స్వచ్ఛతపై అధికారులతో సమీక్ష

**మల్కాజిగిరి:** డివిజన్ పరిధిలో దోమలు, చెత్త నివారణకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం శానిటేషన్, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు గ్రీన్ వేస్టేజ్ కాలనీల్లో ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామన్నారు. అందుకు అవసరమయ్యే నూతన పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు సూచించామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువత, మేధావులను భాగస్వామ్యులను చేసి విజయవంతం చేస్తామన్నారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఎంటమాలజీ ఏఈ వనజ, ఎస్ఎస్. శ్రీనివాస్, శివ, గిరి, బాలామణి, రాంకీ ప్రతినిధులు దయానంద్, జ్యోతి పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

**గౌతంనగర్:** గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జున నగర్‌లోని ఏకలవ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర లెప్రసీటీమ్ సభ్యులు మాట్లాడుతూ.. కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించడమే ధ్యేయమని, కుష్టువ్యాధిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. వెంకటేశ్వరచారి, సాకలరెడ్డి, సురేందర్‌లు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలకే పరిమితం!

మినీస్టేడియం కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూపు | పట్టించుకోని పాలకులు, అధికారులు | క్రీడా స్థలం లేక వెనుకబడిపోతున్న క్రీడాకారులు

క్రీడల్లో ఎంత ప్రతిభ ఉన్నా వారు సరైన తర్ఫీదు పొందలేకపోతే మంచి క్రీడాకారులకు రాణించలేరు. ముఖ్యంగా రోజూ తమలోని ప్రతిభను మెరుగుపర్చుకుంటేనే భవిష్యత్‌లో మరింతగా ఎదుగుతారు. అయితే ఇదంతా జరగాలంటే వారికి సరైన క్రీడా మైదానం అవసరం. కానీ మైదానం లేకపోవడంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులు కూడా మరుగునపడిపోతున్నారు. ముఖ్యంగా ఘట్‌కేసర్ మండలంలో రెండు దశాబ్దాలకు పైగా మినీ స్టేడియం కోసం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది నెరవేరడం లేదు.



ఘట్‌కేసర్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)



ఘట్‌కేసర్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

**ఘట్‌కేసర్:** ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇక్కడ కొదువలేదు. దశాబ్దాలుగా ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఒక వెలుగు వెలిగారు. వందలాదిమంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర జట్లకు ప్రాతినిథ్యం వహించి ఘట్‌కేసర్ మండల క్రీడాకీర్తిని నలుదిశలా చాటారు. కానీ ఔత్సాహిక క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించకపోవడంతో ఆటల్లో వెనకబడిపోతున్నారు. ఉమ్మడి ఘట్‌కేసర్ మండంలోని క్రీడాకారులకు అండగా మేమున్నామంటూ చేయూతనిచ్చి ముందుకు తీసుకుపోయే వారికోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

### క్రీడాకారులకు కొదవలేదు...

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఇతర అంశాల్లో జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. క్రీడాకారులకు గొప్ప పేరున్న ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో మినీ స్టేడియం కలగానే మిగిలింది. క్రీడాకారులకు సొంత మైదానం లేక దశాబ్దాల కాలంగా పట్టణంలోని గురుకుల క్రీడా మైదానాన్ని వినియోగిస్తున్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన స్పందించే పాలకులు కరువయ్యారు. జాతీయ స్థాయి క్రీడాకారులున్న ఘట్‌కేసర్‌లో స్టేడియం లేక నైపుణ్యం గల క్రీడాకారులు మరుగున పడిపోతున్నారు. మండలంలో 70 ప్రభుత్వ పాఠశాలలు, వందలాది ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వందలాది మంది క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడిన వారు ఉన్నారు. జాతీయ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా మండలానికి చెందిన శ్రావణ్‌కుమార్ గౌడ్, బద్రీనారాయణ, జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన కిషోర్, రమణారెడ్డి, నాగరాజు, జగత్, సంతోష్ కబడ్డీ క్రీడాకారులు మండలానికే చెందిన వారే. వీరే కాకుండా ఎదులాబాద్, చౌదరిగూడ, వెంకటాపూర్, కొర్రెముల్, ఘట్‌కేసర్‌కు చెందిన ఎందరో క్రీడాకారులు సౌకర్యాలు లేక వెనకపడిపోతున్నారు.

### కాగితాల్లోనే మినీ స్టేడియం...

మండలంలోని క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తయారు చేయడానికి, ఇతర క్రీడాకారులు తర్ఫీదు పొందడానికి మినీ స్టేడియం నిర్మాణం కోసం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మినీ స్టేడియం మంజూరు చేయించి రూ. 80 లక్షలతో నిర్మించడానికి ఉత్తర్వులు జారీ చేయించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి క్రీడాభివృద్ధికి మినీ స్టేడియం నిర్మించాలని కోరుతున్నారు.

### క్రీడాకారులకు మంచి వాతావరణం కల్పించాలి



మినీ స్టేడియం ఏర్పాటుతో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతారు. ఆటలకు దూరం కావడంతో యువత వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. స్టేడియం ఉంటే వారికి మంచి వాతావరణం లభిస్తుంది.

– మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, వాలీబాల్ నేషనల్ రెఫ్రీ, కోచ్, వీబీఐటీ పీడీ

### స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగం సాధించా



ఆరేడు లక్షల జనాభా ఉన్న ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో పదేళ్ల ముందే నిర్మించాల్సింది. క్రీడా వసతులు లేకపోతే క్రీడాకారులు తయారుకాలేరు. గతంలో మేము నగరానికి వెళ్లి శిక్షణ పొందాం. సౌకర్యాలు లేక యువత ఆసక్తి చూపపోవడంతో క్రీడాకారులుగా ఎదగడం లేదు. క్రీడాకారుల కోటాలోనే రైల్వేలో ఉద్యోగం సాధించాను.

– సంతోశ్‌కుమార్, వాలీబాల్ నేషనల్ మాజీ క్రీడాకారుడు, ఘట్‌కేసర్

### ప్రభుత్వం ప్రోత్సహించాలి



యువతకు క్రీడలపై ఆసక్తి చూపేందుకు ప్రోత్సహించాలి. మండలంలో జాతీయ, అంతార్జాతీయంగా ఆడే నైపుణ్యం గల క్రీడాకారులు పుష్కలంగా ఉన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారిస్తే క్రీడాకారులుగా ఎదుగుతారు. స్టేడియం నిర్మించాలి.

– రాజు, వాలీబాల్ నేషనల్ మాజీ క్రీడాకారుడు, ఎదులాబాద్

## ఉత్తమ డ్రైవర్‌గా వెంకటేశ్వర్లు



డ్రైవర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న పలువురు

**మేడ్చల్:** 33 సంవత్సరాల సర్వీసులో ఒక్క ప్రమాదం చేయకుండా మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన వెంకటేశ్వర్లు ఉత్తమ డ్రైవర్‌గా నిలిచాడు. తన సర్వీసులో ఒక్క ప్రమాదం చేయకుండా బస్సు నడిపిన వెంకటేశ్వర్లును ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక చేసి అభినందించారు. మంగళవారం నగరంలోని రాణిగంజ్ డిపోలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏసీపీ శంకర్ వెంకటేశ్వర్లును సన్మానించారు. అలాగే శామీర్‌పేట్ మండలం హకీంపేట్ డిపోకు చెందిన ఆర్.శ్రీనివాస్ సైతం ఉత్తమ డ్రైవర్‌గా నిలవడంతో అయనను సన్మానించారు. గణతంత్ర దినత్సోవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ చేతుల మీదుగా డ్రైవర్ వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాన్ని సైతం అందుకున్నాడు.

## పదవి లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉండాలి



ఎమ్మెల్యే మల్లారెడ్డితో మాజీ ప్రజాప్రతినిధులు

**ఘట్‌కేసర్:** పదవి ఉన్నా లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడే నాయకులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ మాజీ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, మహిపాల్‌రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, బండారి వసంత, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, హేమలత గోపాల్ రెడ్డి, షేక్ జహంగీర్, బేతాళ నర్సింగరావు, కోఆప్షన్ సభ్యులు పల్లె అరుణ తదితరులు మల్లారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా నిరంతరం కృషి చేస్తూ ప్రజ క్షేత్రంలో ఉండాలని సూచించారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో కార్పొరేటర్లు స్వర్ణరాజ్, శ్రీదేవి

**కుషాయిగూడ:** డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చర్లపల్లి డివిజన్‌లో నూతన సీసీరోడ్ల ప్రతిపాదనలు, ప్యాచ్ వర్క్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. ఇంజినీరింగ్ ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్రవీణ్, ప్రవీణ్‌గౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**కాప్రా:** కాప్రా, చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని మంగళవారం కార్పొరేటర్లు స్వర్ణరాజ్, బొంతు శ్రీదేవి కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జలమండలి ఎండీకి సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో కొత్తగా తాగునీటి పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై త్వరలోనే ప్రణాళికా బద్ధంగా సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని జలమండలి ఎండీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం

**మేడ్చల్:** మండలంలోని శ్రీరంగవరం పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఇతర ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ల్యాబ్‌కు, లైబ్రరీకి తాళాలు వేసి ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పాఠశాలకు వస్తున్నానని తెలిసి కూడా గదుల తాళం తీయలేదంటే క్లాసులు ఎలా చెబుతున్నారో అర్థం అవుతుందని అన్నారు. డిజిటల్ క్లాసులు రోజు చెబుతున్నామని ఉపాధ్యాయులు చెప్పగా తాళాలు తీయకుండా క్లాసులు ఎలా చెబుతున్నారో తెలుస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు తీరు మార్చుకుని నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు.

## నేడు రక్తదాన శిబిరం

**కాప్రా:** మన్నె సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం నేడు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటిన్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు.

## ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేశాం



బద్దం మమత జగన్మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న పోచారం గ్రామ ప్రజలు

**పోచారం:** మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ప్రజల సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేయగలిగామని మాజీ కౌన్సిలర్ బద్దం మమత జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కౌన్సిలర్‌గా ఐదేళ్లు సేవలందించిన బద్దం మమతను పోచారం గ్రామ ప్రజలు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోచారంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, 20 లక్షల లీటర్ల తాగునీటి రిజర్వాయర్ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. పోచారాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పలు ఆలయాలను నిర్మించడం జరిగిందన్నారు. అన్నానగర్‌లో సుమారు రూ.90 లక్షల సొంత నిధులతో మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సహకారం ఉండటం వల్లే పలు అభివృద్ధి పనులు చేయగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బద్దం జగన్మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణ, బాల్‌రాజ్, జయపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, నిరూప్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మార్‌సీఈలో ముగిసిన హ్యాకథాన్



హ్యాకథాన్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో ట్రిబుల్ ఐటీ, స్వేచ్ఛ– విశ్వం ఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్–ఏఐ హ్యాక్ డే మంగళవారంతో ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో విద్యార్థుల బృందాలు ఏఐ టెక్నాలజీ ఉపయోగించి వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ, గేమింగ్, మహిళా సంరక్షణ వంటి వాటికి సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ విద్యార్థులను అతిథులుగా పాల్గొన్న చైతన్య, ఆంజినాగూర్ నూరి, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌లు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని పలు విద్యార్థి క్లబ్‌లు పాల్గొన్నారు.

## పాఠశాలలో డైనింగ్ హాల్ ప్రారంభం



డైనింగ్ హాల్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

**మేడ్చల్‌రూరల్:** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పైప్‌లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సహకారంతో విద్యార్థుల కోసం డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఏరియా మేనేజర్ శ్రీరాం నర్సింహ, జీఎం సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ బాబుయాదవ్, పాఠశాల హెచ్‌ఎం శంకరయ్యలు మంగళవారం ఈ హాల్‌ను ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు సాయికుమార్, రాజేశ్వర్‌రావు, మాజీ వార్డు సభ్యులు శశికుమార్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

## 24 నుంచి కీసరగుట్టలో మహాశివరాత్రి జాతర



కరపత్రాలు విడుదల చేస్తున్న తటాకం నారాయణశర్మ

**కీసర:** ప్రసిద్ధిగాంచిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి జాతర ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 24న విఘ్నేశ్వర పూజ, 25న స్వామివారి కల్యాణం, 26న మహాశివరాత్రి రోజున ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 27న విమాన రథోత్సవం, 28న వసంతోత్సవం, పుష్ప యాగం, మార్చి 1న పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరాడు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




మాట్లాడుతున్న కర్రె రాజేష్

**పోచారం:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ కోరారు. మంగళవారం అన్నోజిగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తే తిప్పికొట్టాలని కార్యకర్తలను కోరారు. గత ప్రభుత్వంలో రైతు బంధు, బీసీ బంధు వంటి పేర్లతో ఒకదాని తర్వాత మరొకటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు లబ్ధి చేకూరకుండానే బంద్ చేశారని ఎద్దేవా చేశారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. పంటలు పండించని భూ ములను రైతు భరోసా నుంచి మినహాయించి, వ్యవసాయ భూములకు ఎకరాకు రూ. 12 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. అర్హులైన వారందరూ పథకాల ద్వారా లబ్ధి పొందుతారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్, నాయకులు భోజిరెడ్డి, మాధవి, వినోద్ కుమార్, సహదేవ్, జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్థమయ్యేలా ఇంగ్లిష్ బోధన ఉండాలి



శ్రీరంగవరం పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ గౌతమ్‌పోట్రు



నూతన్‌కల్ పల్లె దవాఖానాలో రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్

పాఠశాలలు, పల్లె దవాఖానాలను తనిఖీ చేసి సూచనలు చేసిన కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్:** డిజిటల్ క్లాసులకు వచ్చే ఇంగ్లిష్ విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. మండలంలోని శ్రీరంగవరం, నూతన్‌కల్ గ్రామాలలో ఆయన పర్యటించి పాఠశాలలు, పల్లె దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. శ్రీరంగవరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల డిజిటల్ క్లాసులను పరిశీలించి క్లాసులకు వచ్చే ఇంగ్లిష్ పిల్లలకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించిన ఆయన ఇంగ్లిస్ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. గణితంపై పలు ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలను బోధించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్, లైబ్రరీ, వంటగదిలను పరిశీలించి అవసరమైన సూచనలను చేశారు. ల్యాబ్‌లో అవసరం లేని పరికరాలను తొలగించాలని ఆదేశించారు. పక్కనే ఉన్న పశువుల డాక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

**నూతన్‌కల్‌లో..**

నూతన్‌కల్ గ్రామంలో కలెక్టర్ గౌతమ్ పోట్రు పల్లె దవఖానాను, తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఔట్ పేషెంట్స్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ఏఎన్ఎంలతో మాట్లాడి వైద్య సేవలను ఆరాతీశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘునాథస్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ వసంతలక్ష్మి, జెడ్పీ సీఈఓ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.